క్లుప్తంగా

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



కాళేశ్వరంలో హోమం నిర్వహిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

43 మందికి జరిమానా

గోవిందరావుపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన 43 మందికి జరిమానా వేసి ఒకరికి జైలు శిక్ష విధించిన సంఘటన పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని పస్రా చౌరస్తా, గోవిందరావుపేట సెంటర్‌లో కొన్ని రోజుల క్రితం వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేయగా మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టులో తేలిన వారిని ములుగు జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ జ్యోత్స్న న్యాయమూర్తి ముందు హాజరుపరుచగా విచారణ చేసి 43 మందికి రూ.45500 జరిమానా విధించి ఒకరికి జైలు శిక్ష వేశారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఏటూరునాగారం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు శుక్రవారం స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైన ఫోన్ పోగొట్టుకుంటే మీసేవ, యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. చిన్నబోయినపల్లికి చెందిన తుమ్మ నర్సిరెడ్డి, యాలం శ్రీను, తదితరులు ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గోవిందరావుపేట: హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జల విహార్‌లో నేడు(శనివారం) నిర్వహించ తలపెట్టిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవాలను విజయవంతం చేయాలని టీజేఎఫ్ మండల కో కన్వీనర్ వేముల సతీష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీజేఎఫ్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రజతోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమాచారం ఇవ్వండి.. పారితోషికం పొందండి



నిందితుడు రాజేశ్

మంగపేట: మండంలోని కమలాపురం గ్రామానికి చెందిన రాంపూరీ రాజేశ్ అనే వ్యక్తి ఓ కేసులో నిందితుడిగా ఉండి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుతున్నాడని అతడి ఆచూకీ తెలిపిన వారికి నగదు పారితోషికాన్ని ఇస్తామని ఎస్సై తిరునగిరి వెంకటరంగసూరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో ఓ క్రైం కేసులో ముద్దాయిగా ఉన్నాడని కేసు విషయంలో ములుగు కోర్టుకు హాజరుకాకుండా కొంత కాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడన్నారని అన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైన 87126 70092, 87126 70093 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారికి తగిన నగదును పారితోషికంగా అందిస్తామన్నారు.

అంతిమయాత్రకు అవస్థలు

- శ్మశానవాటికలకు సరిగా లేని రోడ్లు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించింది. కానీ అంతిమయాత్రలో భాగంగా శ్మశానవాటికలకు వెళ్లడానికి సక్రమంగా రోడ్లు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో అనుకూలమైన స్థలంలో వైకుంఠధామాలను ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా మండల కేంద్రంలో చిట్యాల, వెంకట్రావుపల్లి, చింతలపల్లిలో మృతదేహాలను ఆయా గ్రామాల ఊరి చివరి వైపున ఖననం చేస్తుంటారు. మండల కేంద్రానికి మూడు వైపులా వైకుంఠధామాలు నిర్మించాల్సిన ఉండగా అధికారులు చింతపల్లి వైపు మాత్రమే నిర్మించారు. దీంతో మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీ, చిట్యాల బీసీ కాలనీలో ఎవరైన చనిపోతే చలివాగు వద్దకు వెళ్లి ఖననం చేయాలి. అటు వైపుగా దారి సరిగా లేక పోడంతో వారి ఇబ్బందులు అంతాఇంతా కావు. అలాగే మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో వైకుంఠధామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. దారి మొత్తం బురదమయం గుంతలు, రాళ్లతో ఉంది. దారులు సక్రమంగా లేకపోవడంతో అధికారుల పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠధామాలకు శాశ్వత రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏలేటిరామయ్యపల్లిలో అధ్వానంగా ఉన్న శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు

పాఠశాల అభివృద్ధిపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాళేశ్వరం: పాఠశాల అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, యువతతో మహదేవపూర్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రాజిరెడ్డి అధ్యక్షతన పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే నూతన విద్యాసంవత్సరంలో బడిబాట, పాఠశాల అడ్మిషన్స్, మౌలిక సదుపాయాల కల్పన గురించి, విద్యా ప్రమాణాల పెంపు తదితర విషయాలపై చర్చించారు. పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కోట రాజబాపు, మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణ, మాజీ ఎంపీపీ బి.రాణిబాయి, యువజన నాయకులు సంతోష్ కుమార్, అస్రార్ ఖురేషి, తిరుపతిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణానికి చెందిన నేరుపాటి మొగిలి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య పరామర్శించారు. మొగిలి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, పార్టీ నాయకులు బిబి చారి, కట్ల నరసింహచారి, దాసరి బ్రహ్మారెడ్డి, కలవల రాజమౌళి, పుల్యాల తిరుపతి, సుభాష్, రాజేందర్, బండారి మధు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



రూ.లక్ష చెక్కు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని ఏలేటిరామయ్యపల్లి గ్రామంలో నిర్మించే అభయాంజనేయస్వామి దేవాలయానికి దాతలు తమ వంతు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కనుకుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి నరేష్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మించే అభయాంజనేయ స్వామి దేవాలయానికి లక్ష్మీనరసింహస్వామి ట్రేడర్ యాజమానులు కనుకుల శ్రీనివాస్‌రెడ్డి, కోత్తూరి భాస్కర్‌రెడ్డి రూ.లక్ష నూటపదహారులు, అలాగే గ్రామానికి చెందిన మర్రి ఐలయ్య రూ.పదివేల నూటపదహారులు, కనుకుల మల్లారెడ్డి రూ.పదివేల నూట పదహారులు విరాళం అందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏలేటి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్, సురేందర్‌రెడ్డి, కొడారి కోంరయ్య, బుర్రి తిరుపతి, కనుకుల రాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజు, కార్తీక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కాటారం: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన మంతెన శ్రీనివాస్ కాళేశ్వరంలో నిర్వహించిన సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బకు గురై ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు పరామర్శించారు. రూ.7వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



గోవిందరావుపేట: చెక్కులు అందజేస్తున్న అశోక్

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి, బుస్సాపూర్, గోవిందరావుపేట, లక్ష్మీపూరం, గాంధీనగర్, కర్లపల్లి, పస్రా, రాఘవపట్నం, మొద్దులగూడెం, సోమలగడ్డకు చెందిన పలువురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆర్థికం సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కులు మంజూరయ్యాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కమలాపురం, మంగపేట, తిమ్మంపేట, మల్లూరు, నర్సింహాసాగర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంత్రి సీతక్క చొరవతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మంగపేట: చెక్కు అందజేస్తున్న జయరాంరెడ్డి

వాజేడులో భారీ వర్షం

వాజేడు: మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వేసవి ఎండలతో ఇబ్బందులు పడిన ప్రజలు.. ఒక్కసారిగా వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది. సుమారు గంట పాటు వర్షం కురవడంతో పలు చోట్ల నీళ్లు నిలిచాయి.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025 విద్యాసంవత్సరంలో నిర్వహించనున్న పీఎంఎస్‌జీఎంబీవై షార్ట్ టర్మ్ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి, ట్రైనింగ్ ఆఫీసర్ తిరుపతి తెలిపారు. ఈ షార్ట్ టర్మ్ కోర్సులో భాగంగా ఒక వారం ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్ పూర్తి చేయించి పరీక్ష నిర్వహించిన అనంతరం ఉత్తీర్ణులైన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కింద సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రిషియన్ కోర్సు పూర్తి చేసిన వారు, పూర్తి చేయబోతున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు స్థానిక ఐటీఐ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, ట్రైనింగ్ ఆఫీసర్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్హర్: సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కొయ్యూరు పోలీసులు తెలిపారు. మండలంలోని కొయ్యూరు -కాటారం ప్రధాన రోడ్డుపై శుక్రవారం సైబర్ నేరాలపై కొయ్యూరు పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచితులు పంపే మెస్సేజ్‌లకు రిప్లై ఇవ్వొద్దన్నారు. బ్యాంకులు గానీ, పనిచేసే కార్యాలయాలు గానీ ఫోన్లో ఎలాంటి సమాచారాన్ని అడగవని, అవసరం అయితే నేరుగా కలవమని చెబుతారని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

వాజేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ పాయం వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని చెరుకూరు, శ్రీరాంనగర్, ములకనపల్లి గ్రామాల్లో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వైద్య సిబ్బందితో వెళ్లిన ఆయన నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు ఉండకుండా కాల్వలు తీసి బయటకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు శ్రీదేవి, సుమలత, రాజ్యలక్ష్మి, జయంత్ లాల్, తిరుపతి, ఆశకార్యకర్తలు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ముగ్గు పోసిన అధికారులు

వాజేడు: ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌజింగ్ ఏఈ ఎండీ ఇషాక్ హుస్సేన్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు కోరారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇళ్లు మంజూరైన ప్రతీ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఎంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే దశల వారీగా డబ్బులు జమ అవుతాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 22 అడుగుల వెడల్పు, 18 అడుగుల పొడవుతో ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు.

అహల్యాబాయి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న సిరికొండ బలరాం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరై మాట్లాడారు. లోకమాత అహల్యా బాయి వీరవనిత అని కొనియడారు. ఈ కార్యక్రమంలో జాడి రామరాజు, కొత్త సురేందర్, స్వరూప, పురం నరేష్, కృష్ణాకర్, యాదగిరి, రవి రెడ్డి, నాగరాజు, మల్లేష్, సతీష్, జానకిరాం, దండిగ వెంకన్న, రాజు, సత్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం క్వారీని నిలిపేయాలి



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వాజేడు: మండల పరిధిలోని ధర్మారం ఇసుక క్వారీని నిలుపుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి, సీపీఎం నాయకుడు జజ్జరి దామోదర్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు పొందిన పట్టాలకు సంబంధించిన సర్వే నంబర్లలో కాకుండా గోదావరి నుంచి కాంట్రాక్టర్ ఇసుకను తరలిస్తున్నట్లు వారు ఆరోపించారు. అనుమతి పొందిన సర్వే నంబర్లలో ఇసుక లేదని గోదావరి నుంచి ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్నట్లు వాపోయారు. అక్రమాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు



రేగొండ: స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సందీప్‌కుమార్



భూపాలపల్లి రూరల్: షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

- సీఐ నాగార్జునరావు

కాటారం: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కాటారం సీఐ నాగార్జునరావు హెచ్చరించారు. మహాముత్తారం మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్, విత్తన విక్రయ దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దుకాణాల్లో పత్తి విత్తనాల నిల్వలు, విత్తన కంపెనీలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. లూజ్, అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు తప్పనిసరిగా కొనుగోలు రసీదు ఇవ్వాలని సూచించారు. అనంతరం సీఐ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయశాఖ, పీఏసీఎస్ అధికారులతో సీఐ సమావేశం నిర్వహించారు. కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎస్సై మహేందర్‌కుమార్, ఏఓ అనూష, సీఈఓ, సిబ్బంది ఉన్నారు.



కాటారం: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేగొండ: నాసిరకం విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఓ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ఎరువులు, విత్తన దుకాణాల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విత్తన డీలర్లు విధిగా స్టాక్ వివరాలు, ధరల పట్టిక రోజు వారిగా నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏఓ వాసుదేవరెడ్డితో కలిసి మండల కేంద్రంలోని పలు షాపులను తనిఖీ చేసి ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను పరిశీలించారు. విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి కొనుగోలు చేసి రసీదు పొంది పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. బిజీ 3, లూజు పత్తి విత్తనాలను కొనుగోలు చేయరాదని, ఎవరైనా అమ్మితే సమాచారం అందించాలని కోరారు.

భూపాలపల్లి రూరల్: ఫర్టిలైజర్ షాపుల యాజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని నాసిరకం విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎస్సై సాంబమూర్తితో కలిసి భూపాలపల్లి పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అలాగే షాపు యాజమానులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

ఈ ఏడాది సాగేదెట్లా?

- గత సంవత్సరం నష్టాలతో కుదేలైన మిర్చి రైతులు
- ధరలేక రాని పెట్టుబడులు
- సాగుకు చేతిలో లేని చిల్లిగవ్వ
- తగ్గనున్న మిర్చి సాగు



తీయకుండా అలాగే ఉన్న గత సంవత్సరం వేసిన మిర్చి మొక్కలు

వాజేడు: ఈ ఏడాది మిర్చి పంట సాగు గత ఏడాదితో పోల్చుకుంటే సగానికి పైగా తగ్గే అవకాశాలు కనబడుతున్నాయి. రెండు సంవత్సరాల నుంచి మిర్చి పంట సాగు చేసిన రైతులకు నష్టాలే తప్ప లాభాలు కనిపించడం లేదు. మండల వ్యాప్తంగా సుమారుగా 4 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగవుతోంది. ఈ సారి సన్న, చిన్న కారు రైతులకు మిర్చి సాగు కష్టంగా మారింది. చాలా మంది రైతులు ఇంకా మిర్చి విత్తనాలను కొనుగోలు చేయక పోవడమే ఇందుకు నిదర్శనం.

మిర్చి రైతులకు నష్టాలు

వాణిజ్య పంటైన మిర్చి పంటను వాజేడు మండలంలో ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. అలాంటిది రైతులకు నష్టాలను తెచ్చి పెడుతుండటంతో దిక్కు తోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పంట కోసం తెచ్చిన అప్పు ప్రతీ ఏడాది ఎంతో కొంత మీద పడుతుండటంతో అయోమయంలో పడుతున్నారు. గత సంవత్సరం ఆశాజనకంగా ఉన్న మిర్చి పంట చివరి నిమిషంలో ధర, దిగిబడి తగ్గడంతో నష్టాలల్లోకి నెట్టింది. దీంతో పెట్టుబడులు కూడా రాలేదు. గతంలో చేసిన అప్పుల్లో తీర్చలేదని పెట్టుబడికి కొత్తగా అప్పు ఎక్కడి నుంచి తెవాలని రైతులు దిక్కుతొచని స్థితిలో ఉన్నారు. కొందరు పెద్ద రైతులు ఇప్పటికే మిర్చి చేలను సిద్ధం చేస్తున్నారు. సన్న, చిన్న కారు రైతులు మాత్రం కనీసం వారు సాగు చేసిన చేలల్లోని పాత మిరుప చెట్లను తొలగించలేదు. మిర్చి పంటను వేయకపోతే పాత అప్పు ఎలా తీరుతాయనే అయోమయంలో పడ్డారు. పంటను సాగు చేయలంటే చేతిలో చిల్లి గవ్వ లేక పోవడంతో మిర్చి విత్తనాలను కూడా కొనలేక పోతున్నారు. ఈ కారణంగానే ఈ ఏడాది మిర్చి సాగు భారీగా తగ్గే అవకాశం ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరిలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు(60) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం గోదావరి తీరంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పక్కనే గడ్డిమందు డబ్బా ఉండడంతో ఆ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. వృద్ధుడు క్రీమ్ కలర్ షర్ట్, నీలిరంగు పాయింట్ ధరించాడు. అతడి గురించి సమాచారం తెలిస్తే తమను సంప్రదించాలని ఎస్సై తెలిపారు. పంచాయతీ కారోబార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.